# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం 19 జూన్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## మారేడుమిల్లి అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



మారేడుమిల్లిఅడవుల్లో బుధవారం తెల్లవారు జామున భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య జరిగిన కాల్పుల్లో మావోయిస్టు సెంట్రల్ కమిటీ సభ్యుడు ఉదయ్, జోనల్ కమిటీ సభ్యురాలు అరుణ మృతి చెందారు. మరొకరు అంజు మృతి చెందారు. ఈ సందర్భంగా ఒక ఏకే 47 ఆయుధాన్ని స్వాధీనంచేసుకున్నారు. ఈ ప్రాంతంలో మరి కొంతమంది మావోయిస్టులు ఉన్నట్టు గ్రే హౌండ్స్‌కి సమాచారం అందడంతో కూంబింగ్ కొనసాగుతున్నట్లు సమాచారం. మావోయిస్టు పార్టీకి వరుస ఎదురు దెబ్బలు తాకుతున్నాయి. ఆ పార్టీ కీలక నేతలు మృతి చెందుతున్నారు.

## దౌత్యవేత్తల పునర్ నియామకానికి గ్రీన్ సిగ్నల్




- భారత్- కెనడా మధ్య కుదిరిన ఏకాభిప్రాయం
- కెనడా ప్రధాని మార్క్ కార్నీ, భారత ప్రధాని నరేంద్రమోడీ మధ్య చర్చలు

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

దౌత్యవేత్తల పునర్ నియామకంపై భారత్- కెనడా మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. జీ7 సదస్సులో పాల్గొనేందుకు కెనడాకు వెళ్లిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆ దేశ ప్రధాని మార్క్? కార్నీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై చర్చించారు. అందులో భాగంగానే ఈ దౌత్యవేత్తల పునర్ నియామకంపై ఏకాభిప్రాయం కుదిరింది. దీంతో గత రెండేళ్లుగా పతనమవుతూ వస్తున్న ఇరుదేశాల సంబంధాలు బలోపేతయమయ్యే అవకాశం ఉంది.

ఇరుదేశాల పౌరులు, వ్యాపారాలకు సాధారణ సేవలను పునరుద్ధరించే లక్ష్యంతో కొత్త హై కమిషనర్లను నియమించడానికి అంగీకరించినట్లు కెనడా ప్రధాని మార్క్ కార్నీ తెలిపారు. ఈ సమావేశం ముఖ్యమైనదని భావిస్తున్నానని అన్నారు. జీ7 అధ్యక్షుడిగా ప్రధాని మోదీకి ఆతిథ్యం ఇవ్వడం సంతోషంగా ఉందని చెప్పారు. ఇక జీ7 ఎజెండాలోని ముఖ్య అంశాలైన అంతర్జాతీయ నేరాలు, అణచివేత, భద్రత గురించి ప్రధాని మార్క్ కార్నీ ప్రస్తావించారు. రాజకీయ ఉద్రిక్తతల కారణంగా భారత్–కెనడా సంబంధాలు దెబ్బతిన్నప్పటికీ టెక్నాలజీ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఆహార భద్రత, కీలకమైన ఖనిజాల్లో సహకారం పెంచుకోవడంపై చర్చలు జరిగాయి. జీ7 సందర్భంగా కెనడా, భారత్ ప్రధానుల మధ్య సానుకూల, నిర్మాణాత్మక సమావేశం జరిగిందని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ఓ ప్రకటనను విడుదల చేశారు. 'ఈ భేటీలో ఇరుదేశాల భాగస్వామ్య విలువలు, ప్రజాస్వామ్యం, న్యాయపాలన వంటి అంశాలపై చర్చించారు. ఇరుదేశాల మధ్య బలోపేతమైన చర్యలకు అడుగులు పడ్డాయి. అందులో మొదటిది హై కమిషనర్ల పునర్ నియామకం' అని ప్రకటనలో ఉంది.

# బనకచర్లకు వివాదానికి కారణం బీఆర్ఎస్

- ఏపీ సీఎంను ఎలా అడ్డుకోవాలో తెలుసు
- సీఎం రేవంత్‌రెడ్డి
- కేసీఆర్‌పై విమర్శలు
- తప్పుపట్టిన బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర
- సమావేశం నుంచి వాకౌట్
- కేంద్రం దృష్టికి తీసుకెళ్తామన్న బీజేపీ ఎంపీలు
- గైర్హాజరైన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి,



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

గోదావరి నదిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్ట్‌పై జరిగిన అఖిలపక్ష ఎంపీల సమావేశం వాడివేడిగా జరిగింది. ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా బనకచర్ల వల్ల రాష్ట్రానికి ఏర్పడే నష్టాన్ని వివ రించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి మాట్లా డారు. మాజీ సీఎం కే చంద్రశేఖరరావు హయాం లోనే ఈ ప్రాజెక్ట్‌కు అంకురార్పణ జరిగిందన్నారు. ఈ వివాదానికి బీఆర్ఎస్‌పార్టీనే కారణమన్నారు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబునాయుడి కి కేంద్రంలో పలుకుబడి ఉన్నా, దాన్ని ఎలా అడ్డుకోవాలో తమకు తెలుసని వ్యాఖ్యానించారు.

బనకచర్ల ప్రాజెక్ట్ అనేది అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో.. అప్పటి సీఎం కేసీఆర్ చేసిన పని వల్లే ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వానికి అన్యాయం జరుగుతుందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. అప్పట్లో ఏపీ సీఎంగా ఉన్న జగన్, తెలంగాణ సీఎంగా ఉన్న కేసీఆర్.. హైదరాబాద్ ప్రగతిభవన్ వేదికగా చర్చలు జరిపారని గోదావరి నదిలో 3 వేల టీసీఎంల మిగులు జలాలు ఉన్నాయని, వాటిని శ్రీశైలం తరలించటానికి బనకచర్ల అనే ప్రతిపాదనను అప్పటి సీఎం కేసీఆర్ తీసుకొచ్చారంటూ మినిట్స్ సాక్ష్యంగా వెల్లడించారు సీఎం రేవంత్ రెడ్డి. అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ పార్టీ తీసుకున్న నిర్ణయం వల్లే ఇప్పుడు తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతుందంటూ లెక్కలు, ఆధారాలు, మినిట్స్ తో సహా సీఎం రేవంత్ రెడ్డి వివరాలను అఖిలపక్షం ఎదుట వివరించారు.

సీఎం వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అక్రమ ప్రాజెక్ట్‌పై మాట్లాడతామని చెప్పి, రాజకీయ ప్రసంగం చేయడం ఏంటని ప్రశ్నించారు. ప్రాజెక్ట్ నిర్మాణం, ప్రభుత్వం చేపట్టాలనుకుంటున్న చర్యల వరకే పరిమితం అయితే బాగుంటుందని సూచించారు. తమ నాయకుడు కేసీఆర్‌పై ఆరోపణలు, నిందలు వేసినందుకు నిరసనగా సమావేశం నుంచి వాకౌట్ చేస్తున్నట్టు ప్రకటించి బయటకు వెళ్లిపోయారు. బీజేపీ తరపున ఆపార్టీ ఎంపీలు డీకే ఆరుణ, రఘునందనరావు హాజరయ్యారు. రాష్ట్రానికి నష్టం జరిగితే ఊరుకోబోమనీ, సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. గోదావరి పై పెండింగ్ ప్రాజెక్టుల్ని సకాలంలో ఎందుకు పూర్తిచేయలేకపోయారంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మీటింగ్‌కు కాంగ్రెస్ ఎంపీలతో పాటు ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్‌ఒవైసీ కూడా హాజరయ్యారు.

సీఎం మాట్లాడుతూ "గోదావరి జలాలను పోలవరం నుంచి బనకచర్ల ద్వారా తరలించడానికి కడుతున్న ప్రాజెక్టు విషయంలో కేంద్ర జలశక్తి మంత్రిని కలిసి ఇప్పటికే అభ్యంతరం తెలియజేశాం. ప్రధానమంత్రిని కూడా కలుస్తాం. ప్రాజెక్టుకు వివిధ సంస్థలు నిధులు సమకూర్చే అవకాశాలు ఉంటాయన్న ఉద్దేశంతో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి గారిని, అలాగే ప్రాజెక్టుకు అనుమతించరాదని పర్యావరణ శాఖ మంత్రిని.. ఇలా సంబంధించిన శాఖలన్నింటినీ కలిసి అభ్యంతరాలను తెలియజేశాం. తెలంగాణ ప్రయోజనాలను కాపడటంలో ప్రభుత్వం బాధ్యతతో అన్ని రకాల ప్రయత్నాలు చేస్తుంది. ఒక పద్ధతిలో ముందుకు వెళుతున్నాం. రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన ఈ విషయంలో అన్ని పార్టీలూ సహకరించాలి. గురువారం ఢిల్లీలో కేంద్ర జల శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ని కలిసి తెలంగాణకు జరగబోయే నష్టంపై మరోసారి వివరిస్తాం. రాజకీయాలకు అతీతంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉంది. అన్ని వ్యవస్థల వద్దకు వెళుతున్నాం. న్యాయం కోసం ఎవరినైనా కలుస్తాం. రివర్ మేనేజ్మెంట్ బోర్డు, పర్యావరణ, జలశక్తి వంటి వ్యవస్థలన్నింటితోనూ సమన్వయం చేసుకుంటూ రాష్ట్ర ప్రయోజనాలు కాపాడటానికి అన్ని రకాల ప్రయత్నాలు చేస్తాం. అప్పటికీ న్యాయం దక్కకపోతే కోర్టును ఆశ్రయిస్తాం.పోలవరం నుంచి బొల్లపల్లి రిజర్వాయర్ వరకు మొత్తంగా 300 టీఎంసీ తరలించుకుపోవడానికి ప్రణాళికలు వేశారు. గోదావరి జలాల్లో తెలంగాణకు 968 టీఎంసీ, కృష్ణా జలాల్లో 558 టీఎంసీలపై చట్టబద్ధమైన హక్కులు కల్పించాలి. వరద నీటిని వినియోగిస్తామన్న వాదన.. తెలంగాణ హక్కులను కాలరాసినట్టే. గోదావరి, కృష్ణా జలాల్లో తెలంగాణకు చట్టబద్ధమైన హక్కులు కల్పించిన తర్వాత ఆంధ్రప్రదేశ్ కట్టుకునే ప్రాజెక్టులపై ఎలాంటి అభ్యంతరం ఉండదు.

బనకచర్ల ప్రాజెక్టు వివాదం ఆకస్మికంగా తెరమీదకు వచ్చింది కాదు. 2016 లో కేంద్ర జలశక్తి మంత్రి సమక్షంలో జరిగిన సమావేశంలో ఆనాటి తెలంగాణ ముఖ్యమంత్రి గోదావరి జలాల్లో 3 వేల టీఎంసీలు వృధాగా సముద్రంలో కలుస్తున్నాయని చెప్పారు. 2019 లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సీఎంల మధ్య పలు దఫాలుగా జరిగిన సమావేశాల్లో గోదావరి జలాలను రాయలసీమకు తరలించడానికి అభ్యంతరం లేదని చెప్పడం.. ఇప్పుడు తెలంగాణకు గుదిబండలా మారింది. ఇరు రాష్ట్రాల సీఎంలు తీసుకున్న నిర్ణయాల పరిణామ క్రమంలోనే బనకచర్లకు బీజం పడింది.. అని కూలంకుషంగా ముఖ్యమంత్రి గారు సమావేశంలో వివరించారు.ఈ సమావేశానికి కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు గైర్హాజరయ్యారు. ఈ సమావేశంలో ఎంపీలు రాష్ట్ర కాంగ్రెస్ ఎంపీలు రేణుకా చౌదరి , అనిల్ కుమార్ యాదవ్, మల్లు రవి, సురేష్ షెట్కర్ , చామల కిరణ్ కుమార్ రెడ్డి , పోరిక బలరాం నాయక్ , కుందూరు జయవీర్ రెడ్డి , రామసహాయం రఘురామి రెడ్డి , ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, బీజేపీ ఎంపీలు డీకే అరుణ , రఘునందన్ రావు హాజరయ్యారు.

## మృతుల్లో 202 మందిని గుర్తింపు

- విమాన ప్రమాదం ఘటనకు సంబంధించి 157 మృతదేహాలు కుటుంబాలకు అప్పగింత

**బలగం టీవి, అహ్మదాబాద్**



గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జూన్ 12న జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో మరణించిన వారిలో 202 మందిని డీఎన్ఏ టెస్ట్ ద్వారా గుర్తించారు. ఇప్పటి వరకు 157 మంది మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగించారు. మరో 33 మంది మృతుల గుర్తింపు, వారి మృతదేహాల అప్పగింత ప్రక్రియ వివిధ దశల్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఐదుగురి డీఎన్ఏ పరీక్షలు ఇంకా జరుగుతున్నాయని చెప్పారు. 15 మృతదేహాల గుర్తింపు కోసం కుటుంబ సభ్యుల నుంచి అదనపు నమూనాలు సేకరించాల్సి ఉన్నదని అన్నారు. మరో 10 మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగించే ప్రక్రియ కొనసాగుతున్నదని వెల్లడించారు. కాగా, ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో మరణించిన వారిలో ఇద్దరు విదేశీయుల మృతదేహాలను వారి దేశాలకు పంపించారు. 11 మృతదేహాలను గుజరాత్ బయట ఉన్న ఇతర రాష్ట్రాలకు తరలించారు. డీఎన్ఏ టెస్ట్ ద్వారా గుర్తించిన 202 మృతదేహాల్లో ఎక్కువగా రోడ్డు మార్గం ద్వారా గుజరాత్‌లోని పలు ప్రాంతాలకు అంబులెన్స్‌లో పంపారు. విమానంలో ప్రయాణించి మరణించిన వారిలో 123 మంది భారతీయులు, 27 మంది బ్రిటన్ జాతీయులు, నలుగురు పోర్చుగీస్ పౌరులు, ఒక కెనడియన్ ఉన్నారు. ప్రయాణికులు కాని నలుగురు విమాన ప్రమాదం జరిగిన ప్రాంతంలో మరణించారు.

## భారత్-పాక్ ఒప్పందంలో మీ ప్రమేయం లేదు

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు స్పష్టం చేసిన ప్రధాని మోడీ
- 35 నిమిషాల పాటు ఫోన్ కాల్

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

భారత్–పాకిస్థాన్ మధ్య జరిగిన కాల్పుల విరమణ ఒప్పందంలో అమెరికా ప్రమేయం లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ఆయన మోడీ స్పష్టంగా చెప్పినట్లు కేంద్ర విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. ట్రంప్‌తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫోన్‌లో మాట్లాడినట్లు వెల్లడించారు. ట్రంప్–మోదీ మధ్య ఫోన్ కాల్ సంభాషణ సారాంశాన్ని వీక్రమ్ మిస్రీ మీడియాకు వివరించారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఫోన్ కాల్ ద్వారా ట్రంప్ మోదీకి సంతాపం తెలియజేశారని, ఆ తర్వాత ఇద్దరూ మాట్లాడుకోవడం ఇదేనని మిస్రీ తెలిపారు.

'జీ7 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ–ట్రంప్ మధ్య ద్వైపాక్షిక భేటీ జరగాల్సి ఉంది. అయితే, ట్రంప్ ముందుగానే వెళ్లిపోవడం వల్ల ఆ సమావేశం జరగలేదు. అనంతరం ఇరు దేశాధినే తలు 35 నిమిషాల పాటు ఫోన్‌లో మాట్లాడుకున్నారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్–అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం గురించి ఎలాంటి చర్చలు జరగలేదు. అలాగే భారత్–పాకిస్థాన్ మధ్య అమెరికా మధ్యవర్తిత్వానికి అంశాలపై చర్చలు కూడా జరగలేదు. కాల్పుల విరమణ ఒప్పందానికి సంబంధించి భారత్–పాక్ మధ్య డీజీపీ స్థాయి చర్చలు మాత్రమే జరిగాయి. పాక్ అభ్యర్థన మేరకే ఆపరేషన్ సిందూర్‌ను నిలిపివేశాం. ఇప్పటి వరకు భారత్ ఇతరుల మధ్యవర్తిత్వాన్ని అనుమతించలేదని, ఇక ముందు కూడా అలా జరగదని ట్రంప్‌నకు మోదీ స్పష్టం చేశారు. ఈ విషయంలో భారత్‌లో పూర్తి రాజకీయ ఏకాభిప్రాయం మాత్రమే ఉంటుంది తెలిపారు' అని మిస్రీ వెల్లడించారు.భారత్‌లో జరిగే క్వాడ్ తదుపరి సమావేశం కోసం ట్రంప్‌ను మోడీ ఆహ్వానించినట్లు మిస్రీ వెల్లడించారు. మోడీ ఆహ్వానాన్ని అంగీకరించారు ట్రంప్ అన్నారు.

## సీఎం కేసీఆర్ హయాంలోనే బనకచర్లకు అంకురార్పణ : సీఎం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



బనకచర్లపై సమావేశం అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలోనే గోదావరి –బనకచర్లకు అంకురార్పణ జరిగిందన్నారు. 2019 అక్టోబరులో కేసీఆర్, జగన్ కలిసి గోదావరి జలాలను రాయల సీమకు తరలించడంపై చర్చించు కున్నారని తెలి పారు. రాయలసీమకు గోదావరి జలాల తరలింపులో సహకరిస్తామని కేసీఆర్ అన్నట్టు వారి సొంత పత్రిక లో రాశారని గుర్తుచేశారు. రాజకీయాలు ఎలా ఉన్నా రైతుల విషయంలో రాజీపడేది లేదన్నారు. బనకచర్ల వ్యవహారంపై ఎలా ముందుకెళ్లాలనే అంశంపై విపక్షాలతో చర్చించామన్నారు. గోదావరి, కృష్ణా జలాల్లో తెలంగాణ ప్రయోజనాలను కాపాడటంలో ప్రభుత్వం బాధ్యతగా రాజకీయ, న్యాయ పోరాటం చేస్తుందని ముఖ్యమంత్రి చెప్పారు. గోదావరి నుంచి రాయలసీమకు నీటిని తరలించాలని ఆంధ్రప్రదేశ్ అక్రమంగా చేపడుతున్న బనక చర్ల ప్రాజెక్టును అడ్డుకోవడానికి ప్రధానమంత్రితో సహ అందరినీ కలుస్తామని అన్నారు. నీటి వాటా పై తెలంగాణ హక్కులు, ప్రయోజనాల కోసం ఎంతవరకైనా పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు.

తెలంగాణకు గోదా వరి, కృష్ణా నదులే జీవనాధారమనీ, రాష్ట్ర ప్రభుత్వా నికి రైతుల ప్రయోజనాలే ముఖ్యమని చెప్పారు. 2016, సెప్టెంబరు 21న కేంద్ర ప్రభుత్వం అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహించిందన్నారు. ప్రతి సంవత్సరం 3000 టీఎంసీల నీరు వృధాగా గోదావరి నీరు సముద్రంలో కలుస్తున్నదని అపెక్స్ కౌన్సిల్ భేటీలో కేసీఆర్ అన్నారని గుర్తు చేశారు. మూడు వేల టీఎంసీలు వృధాగా పోతున్నాయని మొదట మాట్లాడింది ఆయనేనని చెప్పారు. అపెక్స్ కౌన్సిల్ భేటీలో ఎవరు ఏం మాట్లాడారో అంతా రికార్డు రూపంలో ఉందనీ, రాయలసీమకు గోదావరి జలాల తరలింపుపై చర్చించుకున్నామని అప్పట్లో తెలంగాణ, ఏపీ మంత్రులు మీడియాకు చెప్పారని వివరిం చారు. గోదావరి–బనకచర్లపై అవసరమైతే సుప్రీంకోర్టుకైనా వెళ్లాలని భావిస్తున్నామని తెలిపారు. నీటి ఒప్పందాలపై నిపుణులైన న్యాయవాదులను నియమించుకుంటామనీ, రాష్ట్ర ప్రయోజనాలు కాపాడుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తామన్నారు. గోదావరి బనకచర్లను వ్యతిరేకిస్తూ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని నిర్ణయించామన్నారు. అన్ని పార్టీలను కలుపుకుని పోరాడుతామని తెలిపారు.తెలంగాణకు కృష్ణా జలాల్లో 299 టీఎంసీలు సరిపోతాయని అప్పుడే కేసీఆర్ ఒప్పుకుని సంతకం చేశారని గుర్తు చేశారు. అప్పట్లో కేసీఆర్ చేసిన సంతకం ఈరోజు తెలంగాణకు ప్రతిబంధకంగా మారిందని వివరించారు. గోదావరి బేసిన్‌లో తెలంగాణ ప్రాజెక్టులకు ఏపీ అడ్డుపడుతున్నదని సీఎం రేవంత్ అన్నారు. గోదావరిలో హక్కుగా ఉన్న 968 టీఎంసీలు వినియోగించుకునేందుకు తమకు అనుమతి ఇవ్వాలన్నారు. కృష్ణాబేసిన్‌లో 500 టీఎంసీలు, గోదావరిలో 1000 టీఎంసీలకు ఎన్‌వోసీ ఇస్తే ఏపీ బనకచర్లకు ఎలాంటి అభ్యంతరాలు చెప్పబోమని వ్యాఖ్యానించారు. తమ ప్రాజెక్టుల్లో నీళ్ల లేకుండా మిగులు జలాలు ఉన్నాయని ఏపీ చెబుతున్నదన్నారు. కృష్ణాజలాల్లో పదేండ్లల్లో 299 టీఎంసీలు ఏనాడైనా వాడారా అని ప్రశ్నించారు. కేసీఆర్ చేసిన ద్రోహంతో ఏపీకి నీళ్ల వెళుతున్నాయని అన్నారు. ఐదు నెలలుగా తెలంగాణ అభ్యంతరాలతోనే బనకచర్ల అనుమతిపై కేంద్రం పునరాలోచనలో పడిందన్నారు. కేసీఆర్ చేసిన పాపంతో ప్రాజెక్టులు పూర్తికాలేదనీ, దక్షిణ తెలంగాణలో ప్రాజెక్టులు పూర్తిచేయకుండా కేసీఆర్ ద్రోహం చేశారని వ్యాఖ్యానించారు. ఏపీ సీఎం చంద్రబాబుకు తెలంగాణ సీఎం రేవంత్ అల్టీమేటమ్ ఇచ్చారు.కేంద్రంలో పలుకుబడి ఉంది కదా అని అన్ని ప్రాజెక్టులకు అనుమతులు వస్తాయని అనుకోవద్దు..అది భ్రమే అవుతుంది. బనకచర్లను ఎలా అడ్డుకోవాలో తమకు తెలుసని సీఎం అన్నారు.తమ హక్కుల కోసం ఎక్కడా రాజీపడేది లేదన్నారు. తెలంగాణ ప్రయోజనాల కోసం ఎవరితోనైనా కొట్లాడతామన్నారు. తమ హక్కులకు అడ్డువస్తే రాజ కీయంగా పోరాడుతామనీ, న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని చెప్పారు. మోడీకి చంద్రబాబు, చంద్రబాబు మోడీకి అవసరం ఉందన్నారు. ఇద్దరు పరస్పరం సహకరించుకుంటున్నారని గుర్తు చేశారు.

## జీఎస్-ఈసీని ప్రారంభించిన సీఎం



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకమైన గూగుల్ సేఫ్టీ ఇంజనీరింగ్ సెంటర్‌ను ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు లాంఛనంగా ప్రారంభించారు. హైటెక్ సిటీ సమీపంలో దివ్యశ్రీ బిల్డింగ్‌లో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ముఖ్యమంత్రి జీఎస్ఈసీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఏసియా–పసిఫిక్ రీజియన్‌లో గూగుల్ మొట్టమొదటి జీఎస్ఈసీ సెంటర్‌ను హైదరాబాద్‌లో ప్రారంభించడం గర్వకారణంగా ఉందని అన్నారు. ప్రపంచంలో పెట్టుబడులకు గమ్యస్థానం ఏదంటే సమాధానం తెలంగాణ అని వస్తుందని చెప్పారు. జీఎస్ఈసీ అందరూ గర్వపడేలా పని చేస్తుందని విశ్వసిస్తున్నా. అలాగే తెలంగాణ లక్ష్యాలను సాధించడంలో గూగుల్ మద్దతు అవసరం. విద్య, భద్రత, మ్యాపింగ్, ట్రాఫిక్, స్టార్టప్స్, ఆరోగ్యం వంటి అనేక రంగాల్లో ఇప్పటికే గూగుల్‌తో కలిసి పనిచేస్తున్నాం. మా ప్రభుత్వంలో భాగస్వాములైన మహిళలు, యువత, రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు గూగుల్ సంస్థ తరహాలోనే ఉన్నతమైన జీవన ప్రమాణాలు కల్పించాలని కోరుకుంటున్నాం. అందుకు అందరం కలిసికట్టుగా గొప్ప ప్రమాణాల కోసం ప్రయత్నిద్దాం. అందుకు గూగుల్ సహకారం కావాలి.

రాష్ట్రంలో నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడానికి ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ నినాదంతో ముందుకు వెళుతున్నాం. ఇందులో భాగంగా 2035 నాటికి తెలంగాణ 1 ట్రిలియన్ డాలర్ ఆర్థిక శక్తిగా, 2047 నాటికి 3 మూడు ట్రిలియన్ డాలర్ ఎకానమి వృద్ధిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. గూగుల్ వచ్చినప్పటి నుంచి ప్రపంచ మారింది. జీవితాలు పూర్తిగా డిజిటల్ మయమయ్యాయి. ఎకానమీ, ప్రభుత్వం, జీవితాలు డిజిటల్ గా మారాయి. డిజిటల్ సిస్టం సురక్షితంగా ఉంటే మరింత అభివృద్ధి సాధిస్తాం. అధునాతన సైబర్ సెక్యూరిటీ, భద్రత విషయంలో పరిష్కారాల కోసం గూగుల్ సైబర్ సెక్యూరిటీ హబ్‌ను ఉపయోగిస్తున్నందుకు గర్విస్తున్నాను. ఈ సెంటర్ స్కిల్స్ డెవలప్‌మెంట్‌పై దృష్టి సారించడమే కాకుండా ఉపాధి అవకాశాలను మెరుగుపరిచి, దేశ సైబర్ సెక్యూరిటీ సామర్థ్యాన్ని పెంచుతుందని భావిస్తున్నా. చెడు కలిగించొద్దన్నది గూగుల్ సంస్థ సిద్ధాంతం. ఆ విధానాన్ని నేను ఇష్టపడుతున్నా. గూగుల్ సంస్థలాగే ప్రభుత్వం కూడా మంచి చేయాలన్న సిద్ధాంతాన్నే విశ్వసిస్తుంది. గూగుల్ – హైదరాబాద్ పాత మిత్రులు. 2007 లో హైదరాబాద్‌లో గూగుల్ ప్రారంభమైంది. నేడు 7 వేల మంది పని చేస్తున్నారు. తెలంగాణలో ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్స్‌కు నైపుణ్యతలో శిక్షణ ఇవ్వడానికి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ప్రారంభించాం.." అని ముఖ్యమంత్రి పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో గూగుల్ గవర్నమెంట్ అఫేర్స్ – పబ్లిక్ పాలసీ వైస్–ప్రెసిడెంట్ విల్సన్ ఎల్ వైట్ గారు, గూగుల్ యాడ్ స్పేసెస్ వైస్–ప్రెసిడెంట్ అరిజిత్ సర్కార్ గారితో పాటు సంస్థ సీనియర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజలను తప్పుదారి పట్టిస్తున్న రేవంత్‌రెడ్డి

- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాజకీయ లబ్ధి పొందాలన్న వక్ర బుద్ధే తప్పా.. తెలంగాణ నీటి ప్రయోజనాలు కాపాడాలనే తపన లేదని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. బోడిగుండుకు మోకాలుకు లంకె పెట్టి మాట్లాడటంలో రేవంత్ రెడ్డి సిద్ధహస్తుడని అని మరోసారి రుజువైంది. అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌లో కేసీఆర్ చెప్పిన వాటిని దురుద్దేశపూర్వకంగా వక్రీకరించాడని ధ్వజమెత్తారు. ప్రజలను తప్పుదారి పట్టించేందుకు ఉద్దేశపూర్వకంగా అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌లోని అజెండా ఐదు అంశాలు దాచి పెట్టి, అజెండా నెంబర్ వన్ మాత్రమే అంశాలను మాత్రమే ప్రస్తావించాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. గోదావరి–కృష్ణ నదుల అనుసంధానం ప్రాజెక్టుల విషయంలో తెలంగాణను సంప్రదించకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ ముందుకు పోకూడదని.. ఒకవేళ వెళ్తే అందుకు తెలంగాణ అంగీకరించదని.. ఆనాడు కేసీఆర్ అజెండాలో స్పష్టంగా పేర్కొన్నారని చెప్పారు. ఈ విషయాన్ని కావాలని దాచిపెట్టి, స్వార్థపూరిత రాజకీయ లక్ష్యాల కోసం అసత్యాలను ప్రజల ముందు ఉంచారని మండిపడ్డారు. మీడియాను సైతం తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని.. అబద్ధాల పునాదులపై జరిగిన ఈనాటి రేవంత్ తతంగాన్ని ప్రజలు విశ్వసించరన్నారు.

## హైడ్రాను అడ్డంపెట్టుకుని బ్లాక్‌మెయిల్ దందాలు


- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



హైడ్రాను అడ్డం పెట్టుకుని రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులంతా బ్లాక్‌మెయిల్ దందాలు చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు ఆరోపించారు. రేవంత్ రెడ్డితో పాటు ఆయన కుటుంబసభ్యులు, కాంగ్రెస్ నేతలు అక్రమంగా కట్టుకున్న ఏ ఒక్క ఇంటి జోలికి వెళ్లడానికి సాహసించని హైడ్రా, పేదల ఇండ్ల మీద మాత్రం ప్రతాపం చూపిస్తున్నదని విమర్శించారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న బీఆర్ఎస్ బోరబండ డివిజన్ మైనార్టీ నాయకుడు మహ్మద్ సర్దార్ కుటుంబాన్ని బుధవారం ఆయన పరామర్శించారు. తన ప్రాణం ఉన్నంత వరకు సర్దార్ కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సర్దార్ ను కాంగ్రెస్ లోకి రావాలని స్థానిక కార్పొరేటర్ అధికారమత్తులో వేధించాడని, అందుకు ఒప్పుకోకపోవడంతో కక్ష కట్టి సర్దార్ ఇంటిని, షాప్‌ను కూల్చివేయించాడని ఆరోపించారు. హైడ్రా, జిహెచ్ఎంసీ అధికారులను అడ్డం పెట్టుకుని వేధించినందుకే తమ నేత సర్దార్ ఆత్మహత్య చేసుకున్నాడని కేటీఆర్ చెప్పారు.తాము తిరిగి అధికారంలోకి వచ్చాక బీఆర్ఎస్ నేతలు, పేదలను వేధిస్తున్న కాంగ్రెస్ నేతల, అధికారుల హిసాబ్ కితాబ్ సెటిల్ చేస్తామని హెచ్చరించారు. అధికారులు వారి ప్రవర్తన మార్చుకోవాలని సూచించారు.

సర్దార్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాడుతామని, అవసరమైతే సుప్రీం కోర్టు వరకు వెళ్తామన్నారు. ఆయన కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని, ఆయన పిల్లల చదువు, భవిష్యత్తుకు భరోసాగా ఉంటామన్నారు. స్థానిక కార్పొరేటర్ కూల్చివేయించిన సర్దార్ దుకాణం, ఇంటిని పార్టీనే బాగు చేయిస్తుందని చెప్పారు. సర్దార్ ఫ్యామిలీ తమ బీఆర్ఎస్ ఫ్యామిలీనేనన్నారు. జూబ్లిహిల్స్ నియోజకవర్గంలో దివంగత మాగంటి గోపినాథ్ లేని లోటును రానివ్వమన్నారు.



## జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కలసిన ప్రభుత్వ విప్

**బలగం టీవీ, సిరిసిల్ల**

ఇటివల ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రిగా నియామకమైన మంత్రివ తుమ్మల నాగేశ్వరరావు ని బుదవారం హైదారాబాద్ లోని మినిస్టర్ క్వార్టర్స్ లో ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి తో కలిసి మర్యాద పూర్వకంగా కలసి వారికి రాజన్న ప్రసాదం అందేసి కండువాతో సత్కరించారు...



## విద్యార్థులకు నోట్స్ బుక్స్ పంపిణీ..

**బలగం టీవీ, సిరిసిల్ల**

సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేట ప్రాథమిక పాఠశాలలో స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈవో దూస రఘుపతి మాట్లాడుతూ స్ఫూర్తి ఫౌండేషన్ ఇటువంటి మరెన్నో స్వచ్ఛంద కార్యక్రమాలు భవిష్యత్తులో కొనసాగించాలని అన్నారు ఫౌండేషన్ కార్యదర్శి మాట్లాడుతూ 2007 లో ఫౌండేషన్ స్థాపించామని, 2011 నుండి వెంకంపేట పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్ అందిస్తున్నమని అన్నారు..ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జ్ హెచ్ ఎం రాణి, పాఠశాల ఉపాధ్యాయినీలు పద్మ, సౌభాగ్య ,ఫౌండేషన్ అధ్యక్షులు కోమాకుల ఆంజనేయులు, కార్యదర్శి శ్రీపతి కాశీరాం సభ్యులు నవీన్ గోవర్ధన్, సతీష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నాడు శ్రీ రాజరాజేశ్వర జలాశయం కళకళ

- నేడు విల విల...
- తెలంగాణా గుండె కాయ, మిడ్ మానేరు ను ఎండబెడతారా?
- చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం శ్రీ రాజరాజేశ్వర జలాశయం (మిడ్ మానేరు)ను స్థానిక బిఆర్ఎస్ నాయకులతో కలసి చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సందర్శించారు. అనంతరం రవి శంకర్ మాట్లాడుతూ మేడిగడ్డ నుంచి అనేక లిఫ్టులు, కాలువలు, పంప్ హౌజ్‌ల ద్వారా మిడ్ మానేరుకు గోదావరి నీరు చేరేదని, అక్కడి నుంచి ప్రధాన ప్రాజెక్టులైన లోయర్ మానేరు, అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్‌కు వెళ్ళేవి అని అన్నారు.కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో అత్యంత కీలకమైన మిడ్‌మానేరు ప్రాజెక్టు నీళ్లు లేక వెలవెలబోతుందని, రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం మానువాడ వద్ద మానేరు వాగుపై నిర్మించిన రాజరాజేశ్వర జలాశయం (మిడ్ మానేరు) ప్రాజెక్ట్ సామర్థ్యం 27.50 టీఎంసీలు కాగా ప్రస్తుతం అతి తక్కువగా నీళ్ల మాత్రమే ఉన్నాయని అన్నారు. మేడిగడ్డ ప్రాజెక్టు నుంచి ఎత్తిపోసిన నీళ్లతో గతంలో మిడ్ మానేరు నిత్యం జలకళతో ఉండేదని, కానీ, మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు కుంగిపోయింది అన్న సాకుతో కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్ల విడుదల చేయక పోవడంతో ఆ ప్రభావం మిడ్‌మానేరుపై పడిందని అన్నారు.నీటి నిల్వలు లేక మిడ్‌మానేరు వద్ద ఎత్తిపోతలు ఆపేయడంతో సమీపంలో చెరువులు, కుంటలు కూడా ఎండిపోయాయని అన్నారు.గత బి.ఆర్.ఏస్ ప్రభుత్వం చేసిన ప్రయత్నాలను గుర్తుచేసుకుంటూ, "కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, అప్పర్ మానేర్ మరియు మిడ్ మానేర్ జలాశయాల ద్వారా వాగులు, చెరువులను నింపడం ద్వారా మండే వేసవిలో కూడా రైతులను రక్షించామని, ఇప్పుడు, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతన్నలు ఎంతో నష్టపోయారన్నారు. బి.ఆర్.ఎస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి,గుంటి శంకర్,కమల్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## ఇంటింటి సర్వే



**బలగం టీవీ, బోయినిపల్లి**

ప్రజల శ్రామిక శక్తి ఉద్యోగ ఉపాధి స్థితిగతులపై మండలంలో స్తంభంపల్లి గ్రామంలో ఎంపిక చేయబడిన గ్రామాలలో సర్వే నిర్వహిస్తున్నారు . నిరుద్యోగ ఉద్యోగ అక్షరాస్యత స్థితిగతులపై కేంద్ర ప్రభుత్వం నేషనల్ షాంపిల్ సర్వే ఆఫీస్ ఆధ్వర్యంలో పెద్దింటి సర్వే నిర్వహించారు ప్రజల ఉపాధి అక్షరాస్యతతో పాటు అంశాలపై సర్వే డేటాను ట్యాబ్ లో నమోదు చేశారు ప్రతి ఏటా గ్రామీణ పట్టణ ప్రాంతాలలో సాధన స్థితి మరియు సి డబ్ల్యు ఎస్ రెండిటిలోనూ ఉపాధి నిరుద్యోగ సూచకలను అంచనా వేయడానికి వివరాలు సేకరించినట్లు సర్వే ఎన్యూమినేటర్ గుర్రం శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి షబానా అంగన్వాడి టీచర్ వర్కర్స్ పాల్గొన్నారు

## సిరిసిల్ల కస్తూర్బా టీచర్ పోస్టుల సర్టిఫికెట్ వెరిఫికేషన్..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

సిరిసిల్ల జిల్లా లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలలో ఖాళీగా ఉన్న మహిళా అధ్యాపక పోస్టులను భర్తీ చేయడానికి గత సంవత్సరం జూలై- 2023 లో నిర్వహించిన అర్హత పరీక్షలో ఉత్తీర్ణులైన మెరిట్ జాబితా ఆధారంగా ప్రస్తుతం ఖాళీగా ఉన్న సబ్జెక్ట్ పోస్టులకు ఎంపికైనా 1:3 అభ్యర్తుల జాబితా http://siricilladeo.com/download/index.php వెబ్సైట్ లో ఉంచడమైనది. ఎంపికైన అభ్యర్థులు తేది: 20.06.2025 రోజున జరిగే సర్టిఫికెట్ వెరిఫికేషన్ కి , ఒరిజినల్ సర్టిఫికెట్స్ మరియు ఒక సెట్ జిరాక్స్ తో ఉదయం 10. గంటలకు డీఈఓ ఆఫీస్ లో హాజరు కావాలని రాజన్న సిరిసిల్ల జిల్లా విద్యాధికారి ఎస్?. వినోద్ తెలియజేశారు. అభ్యర్థులకు ఏదయినా సందేహాలు ఉంటే క్రింది నంబర్లకు కాల్ చేయగలరు. హెల్ప్ డెస్క్ నంబర్స్ 9642959599, 9493111179.

# ఆదివాసీలను వంచిస్తున్న కాంగ్రెస్

- ఎమ్మెల్యే కోవాలక్ష్మి, బీఆర్ఎస్ నేతలు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్,



**బలగం టీవీ, హైదరాబాద్**

కాంగ్రెస్ ప్రభుత్వం డిక్లరేషన్ల పేరిట అన్ని వర్గాలను మోసం చేస్తోందని, ముఖ్యంగా జీవో 49తో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీలను వంచిస్తోందని ఎమ్మెల్యే కోవాలక్ష్మి, బీఆర్ఎస్ నేతలు డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నేత డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలను డిక్లరేషన్ల పేరిట మోసం చేసిందని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి చేవెళ్లలో మల్లిఖార్జున్ ఖర్గే విడుదల చేసిన డిక్లరేషన్ కూడా మోసపూరితమేనని అన్నారు. కేసీఆర్ ఎస్సీ, ఎస్టీలను గుండెల్లో పెట్టుకుని చూస్తే, రేవంత్ రెడ్డి డిక్లరేషన్ల పేరిట మోసం చేశారని విమర్శించారు. కవ్వాల్, తడోబా టైగర్ జోన్ల పరిరక్షణ పేరుతో తెచ్చిన జీవో 49తో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆదివాసీలను కాంగ్రెస్ ప్రభుత్వం వంచిస్తోందని ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. ఈ జీవో అనేక తప్పులతో కూడుకుందని, రాజ్యాంగంలోని పలు ఆర్టికల్స్‌ను ఉల్లంఘిస్తోందని ఆయన ఆరోపించారు. కేవలం ఏడు పులుల కోసం ఏడు లక్షల మంది ఆదివాసీ, గిరిజన గూడేల ప్రజలను నిర్వాసితులను చేసే కుట్రతోనే జీవో 49ని తెచ్చారని దుయ్యబట్టారు. ఈ జీవో వల్ల ఆదివాసీ గిరిజనులు వ్యవసాయం చేసుకోలేకపోతున్నారని, పత్తి విత్తలేకపోతున్నారని, నాట్లు వేసుకోలేకపోతున్నారని ప్రవీణ్ కుమార్ తెలిపారు. అడుగడుగునా గిరిజన, ఆదివాసీల హక్కులకు రేవంత్ ప్రభుత్వం భంగం కలిగిస్తోందని, టైగర్ కన్జర్వేషన్ పేరిట గిరిజన, ఆదివాసీ గూడేలను ఖాళీ చేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ పోడు భూములకు పట్టాలు ఇస్తే, రేవంత్ రెడ్డి ఆ భూముల నుంచి వెళ్లగొడుతున్నారని ఆరోపించారు. ఇంద్రవెల్లిలో ఆదివాసీలను కాల్చి చంపిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని గుర్తుచేశారు. పీసా చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఉల్లంఘిస్తూ జీవో 49 తెచ్చిందని ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆపరేషన్ కగార్ ను వ్యతిరేకిస్తున్న రేవంత్ రెడ్డి, టైగర్ కన్జర్వేషన్ పేరిట గిరిజన, ఆదివాసీలను ఎందుకు ఖాళీ చేస్తున్నారని ప్రశ్నించారు. కవ్వాల్‌తో పాటు మహారాష్ట్రలోని తడోబా టైగర్ జోన్ల కోసం గిరిజన, ఆదివాసీల పొట్ట కొడతారా అని నిలదీశారు. వన్యప్రాణి సంరక్షణ చర్యలకు బీఆర్ఎస్ వ్యతిరేకం కాదని, కేసీఆర్ హయాంలో హరిత హారంతో అటవీ విస్తీర్ణం పెరిగిందని గుర్తుచేశారు. రేవంత్ రెడ్డి కంచె గచ్చిబౌలిలో 100 ఎకరాల్లో అడవులను ధ్వంసం చేశారని, నిరసనలు చేసిన వారిపై కేసులు పెట్టారని, ములుగులో ఆదివాసీల ఇండ్లపై దాడులు చేసి, నివాసాలపై దౌర్జన్యం చేశారని ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. జీవో 49 ఏడు లక్షల గిరిజన, ఆదివాసీలపై ప్రభావం చూపే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. గిరిజన, ఆదివాసీలపై ఏ మాత్రం ప్రేమ ఉన్నా వెంటనే జీవో 49ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 339 ప్రభావిత గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ జరిపామని జీవో 49లో తప్పుగా పేర్కొన్నారని, ఎవరినీ సంప్రదించకుండానే తెచ్చిన జీవో 49ని అమల్లోకి తెస్తే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని, గిరిజన, ఆదివాసీలతో కలిసి పోరాటాలకు సిద్ధమవుతామని ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు.ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కోసం బడ్జెట్‌లో పెట్టిన నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం సరిగా ఖర్చు చేయడం లేదని, ఎస్సీ, ఎస్టీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సబ్ ప్లాన్ నిధులు ఖర్చు చేసేలా రేవంత్ రెడ్డిపై ఒత్తిడి పెంచాలని ఆయన కోరారు. ఆదివాసీ గిరిజన సంఘాలతో కలిసి బీఆర్ఎస్ త్వరలోనే ఉద్యమిస్తుందని తెలిపారు.

**ఆదివాసీ గ్రామాలకు రోడ్లు లేవు: ఎమ్మెల్యే కోవాలక్ష్మి**

ఎమ్మెల్యే కోవాలక్ష్మి మాట్లాడుతూ.. ఆసిఫాబాద్ జిల్లాలో గిరిజనులు నివాసం ఉంటున్న భూమిని కవ్వాల్ రిజర్వ్ ఫారెస్ట్‌కు ఇస్తున్నట్లు ప్రభుత్వం జీవో ఇచ్చిందని, దీనితో ఆసిఫాబాద్ జిల్లాలోని గిరిజనులు భయపడుతున్నారని ఎమ్మెల్యే కోవాలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. ఇంద్రవెల్లిలో ఆదివాసీలను కాంగ్రెస్ ప్రభుత్వం కాల్చి చంపిందని గుర్తుచేశారు. ఉమ్మడి ఆదిలాబాద్‌ను అభివృద్ధి చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారని, కానీ గిరిజనుల గూడేల్లో మౌలిక వసతుల కల్పనకు అధికారులు అనుమతి ఇవ్వడం లేదని, ఆదివాసీ గ్రామాలకు ఇప్పటి వరకు రోడ్లు లేవని కోవాలక్ష్మి పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన జీవో నంబర్ 49ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ఎన్నికలు వస్తే రేవంత్ రెడ్డికి కొమురం భీం గుర్తుకు వస్తారని విమర్శించారు. కవ్వాల్ అభయారణ్యం జీవోను ఖానాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కూడా వ్యతిరేకించారని గుర్తుచేశారు. జీవో 49ని ఉపసంహరించకపోతే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఆదిలాబాద్ జిల్లాలో గిరిజనుల సమస్యలను జిల్లా మంత్రి, ఇంఛార్జి మంత్రి పట్టించుకోవాలని, గిరిజన మంత్రిగా సీతక్క సమస్యను పరిష్కారం చేస్తారని ఆశిస్తున్నామని కోవాలక్ష్మి అన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు 4.50 లక్షల ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇచ్చారని ఆమె గుర్తుచేశారు. ఈ ప్రెస్ మీట్‌లో బీఆర్ఎస్ నేతలు తుంగ బాలు, అభిలాష్ రంగినేని, ఆసిఫాబాద్ స్థానిక నేతలు పాల్గొన్నారు.

## నష్టాల్లో ముగిసిన మార్కెట్లు

**బలగం టీవీ, హైదరాబాద్**

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు స్వల్ప నష్టాలతో ముగిశాయి. పశ్చిమాసియాలో ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల నిర్ణయంపై నెలకొన్న ఆందోళనలతో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించారు. దీంతో సూచీలు వరుసగా రెండో రోజూ నష్టాలను చవిచూశాయి. అయితే, ఫైనాన్షియల్, ఆటో రంగాల షేర్లలో కొనుగోళ్ల మద్దతు లభించడంతో మార్కెట్లు భారీ పతనం నుంచి కొంతమేర కోలుకున్నాయి.ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 138 పాయింట్లు నష్టపోయి 81,444 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 41 పాయింట్లు కోల్పోయి 24,812 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 30 షేర్లలో టీసీఎస్, అదానీ పోర్ట్స్, హిందుస్థాన్ యూనిలీవర్, నెస్లే ఇండియా, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు ప్రధానంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. మరోవైపు, ఇండస్‌ఇండ్ బ్యాంక్, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతీ సుజుకీ, ఏషియన్ పెయింట్స్ షేర్లు లాభపడి, మార్కెట్లకు కొంత అండగా నిలిచాయి.

# సివిల్ మ్యాటర్‌లో పోలీసులు దూరి అరాచకాలు సృష్టిస్తుండ్రు..

- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

కాంగ్రెస్ హయాంలో సెటిల్ మెంట్ లకు అడ్డాగా పోలీస్ స్టేషన్లు మారాయని, మాజీ ఎంపీటీసీ కర్కబోయిన కుంటయ్య భూమిని కాంగ్రెస్ నేత కబ్జా చేశాడని,ఫిర్యాదుచేస్తే ఉల్టా మా పార్టీ నాయకుడు కర్కబోయిన కుంటయ్యపైనే కేసు బనాయించి వేధించడంతోనే ఆత్మహత్య చేసుకున్నాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీ ఆర్ ఆరోపించారు.రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్ మాజీ ఎంపిటీసీ కుంటయ్య ఆత్మహత్య చేసుకోగా, వారి కుటుంబాన్ని ఆయన బుధవారం సిరిసిల్లలో పరామర్శించారు. కుంటయ్య మృతదేహానికి నివాళులర్పించారు. కుంటయ్య ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతున్ని ప్రార్థించారు. ఈ సందర్భంగా మీడియాతో కేటీఆర్ మాట్లాడుతూ సివిల్ మ్యాటర్ లో దూరి పోలీసులు సెటిల్మెంట్లు, అరాచకాలు చేయడం సమాజానికి





ఎంతమాత్రం మంచిది కాదన్నారు.

కాంగ్రెస్ నాయకులు ఏం చెప్తే అది చేయడాన్నే డ్యూటీగా భావించి పోలీసులు విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నారని, కుంటయ్య చావుకు కారణమైన పోలీసులపై చర్యలు తీసుకునే వరకు న్యాయపోరాటం చేస్తామని, ఎవరిని వదిలిపట్టమన్నారు.బీ ఆర్ ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో బిఆర్ఎస్ నేతలు ఎవరూ కూడా ఇంత చిల్లర, లేకి పనులు చేయలేదన్నారు. ఏసీబీ విచారణ జరుగుతున్నప్పుడు తన కోసం హైదరాబాద్ దాకా వచ్చి ధైర్యం చెప్పిన కుంటయ్య అదే రోజు రాత్రి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసి మనసు కకావికలమైందన్నారు. రాజకీయ నాయకులు అంటే అందరూ ఏదోదో ఊహించుకుంటారని, బయటికి గంభీరంగా కనిపడ్డా, లోపల దుఃఖాన్ని దాచుకొని ఓ వైపు ప్రజల కోసం పనిచేస్తూ మరోవైపు కుటుంబాన్ని కాపాడుకునే క్రమంలో తీవ్ర ఒత్తిడికి గురవుతారని అన్నారు. తన భూమిని కాంగ్రెస్ నేత కబ్జా చేయడం, పోలీసులు కూడా ఆయనకే వత్తాసు పలకడంతో కుంటయ్య ఆత్మహత్య చేసుకున్నాడని,విషయం తెలిసిన వెంటనే పార్టీ నేతలను పంపి, కాపాడుకునేందుకు శాయశక్తులా ప్రయత్నించినా సాధ్యం కాలేదన్నారు. పార్టీలో నిబద్ధత కల నాయకుడు, నిఖార్సైన గులాబీ సైనికుడు కుంటయ్య ఇద్దరు పిల్లల చదువులు, వారి పెళ్లిళ్లు , ఇతర సమస్యలు అన్నింటికీ తనదే బాధ్యత అని అన్నారు. కుంటయ్య కుటుంబానికి పార్టీ పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని హామి ఇచ్చారు.

ఈరోజు కుంటయ్య కి జరిగింది రేపు మరొకరికి జరగవచ్చు అని, ఈ అరాచకాలను ప్రభుత్వం అదుపుచేయాలని డిమాండ్ చేశారు.ఈ ఆపద సమయంలో కుంటయ్య కుటుంబానికి మనోధైర్యాన్ని ఆ భగవంతుడు ప్రసాదించాలని,పెద్దకర్మ జరిగేదాకా పార్టీ జిల్లా నాయకత్వమే అన్ని పనులు దగ్గరుండి చూసుకుంటుందన్నారు.

# జిల్లాలో రూ. 73 కోట్ల రైతు భరోసా నిధులు

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల**

జిల్లాలోని అన్నదాతలకు రైతు భరోసా కింద మూడు రోజుల్లో రూ. 73 కోట్లకు పైగా డబ్బులు రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ అయ్యాయని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ ఖరీఫ్ వానాకాలం సీజన్ సాగు కోసం రైతులకు ఉపయోగపడేలా రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కింద నిధులు విడుదల చేస్తుందని తెలిపారు. ఈ రోజు వరకు జిల్లాలోని 13 మండలాల పరిధిలోని 97,841



మంది రైతుల బ్యాంక్ ఖాతాల్లో రూ.73,85,58,689 డబ్బులు జమ అయ్యాయని పేర్కొన్నారు.

# పొన్నం రవిచంద్రకు సన్మానం..



**బలగం టీవీ, కరీంనగర్**

తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ లో "ఉత్తమ సినీ విమర్శకులు" అవార్డు అందుకున్న పొన్నం రవిచంద్ర ని కరీంనగర్ లో సన్మానించిన తెలంగాణ రచయితల వేదిక జాతీయ అధ్యక్షులు జూకంటి జగన్నాథం మరియు పాకాల శంకర్ గౌడ్, పర్కాల రవీందర్, సుద్దాల శ్రీనివాస్ గౌడ్, ద్యావనపల్లి రామకృష్ణ లు పాల్గొన్నారు.

# ఇసుక ఉచితమే.. రవాణా భారం..

**అధిక రవాణా చార్జీలతో ఆగమవుతున్న లబ్దిదారులు..**

**అధికారులు స్పందించి న్యాయం చేయాలని వేడుకోలు..**

**బలగం టీవీ, గంభీరావుపేట**

నిరుపేదలకి సొంత ఇల్లు కల్పించడమే ప్రధాన లక్ష్యముగా ప్రభుత్వం ముందుకు పోతుంది.ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేదల ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం అందజేస్తుంది. ఇప్పటికే పలువురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను కూడా పంపిణీ చేసింది. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు సొంత ఇంటి కల నెరవేరబోతున్నందుకు సంతోషంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కూడా చేపట్టరు. ఇసుక ఉచితమైన ఇసుక రవాణా చార్జీలు భారంగా మారడం లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. గంభీరావుపేట మండలం వ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వం రెండు విడుతలో 511 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయగా ప్రభుత్వం లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేసినది. ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు కట్టుకునే నిరుపేదలకు ఇసుక భారం కాకూడదనే సదుద్దేశంతో ఫ్రీ ఇసుకకు పర్మిషన్ ఇచ్చి, గంభీ రావుపేట మల్లు పల్లి ఇసుక క్వారీ నుండి ఉచిత ఇసుకను ప్రభుత్వం కేటాయించింది.రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఉచితం అని చెబుతున్న, ఇసుక రవాణా చేసే ట్రాక్టర్ల యజమానులు మండలంలోని పలు గ్రామాలకు ఇసుక రవాణా చేసినందుకు ఒక్కొక్క ట్రాక్టర్ ట్రిప్పుకు 3500 నుండి 4000 వరకు అధికంగా రవాణా చార్జీలు



వసూలు చేస్తున్నారు. మీ ఇంటి నిర్మాణానికి ఇసుకు అనుమతి తీసుకున్నారని, నిర్మాణానికి ఇసుక మా ట్రాక్టర్ ద్వారానే రవాణా చేస్తామని, ఒక్కొక్క ట్రాక్టర్ డిడి తోనైతే 4000, లేకపోతే 3500 కు రవాణా చేస్తామని, మీ ఇష్టం ఉంటే తీసుకోవచ్చు లేకపోతే లేదు అని అంటున్నారని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేము నిరుపేదలమని ప్రభుత్వం మాకు ఇండ్లు మంజూరు చేస్తే, ఇసుక రవాణా పేరుతో అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని, ఇలాగైతే మా పరిస్థితి ఏమిటి అని ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ఇసుక రవాణా చార్జీలు తగ్గించాలని, లేకపోతే ఆర్థికంగా నష్టపోతామని లబ్ధిదారులు వేడుకుంటున్నారు.



# ప్రెస్ క్లబ్ మండల అధ్యక్షునిగా పట్నం ప్రసాద్

**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల ఐజేయు ప్రెస్ క్లబ్ ఎన్నికలు బుధవారం ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షులుగా పట్నం ప్రసాద్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోగా ఉపాధ్యక్షులుగా గడ్డం తిరుపతి, గజ్జెల శ్రీనివాస్, కత్తెరపాక శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా నల్లగొండ వేణుగోపాల్, కోశాధికారిగా కాసరపు శ్రీధర్ గౌడ్, కార్యదర్శిగా అతికం రాజశేఖర్ గౌడ్, సంయుక్త కార్యదర్శులుగా మైలారం మహేష్ , కూస రవి, కార్యవర్గ సభ్యులుగా దుంపేటి శ్రీనివాస్, పెంతల సంపత్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా పట్నం ప్రసాద్ ను జర్నలిస్టులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు పట్నం ప్రసాద్ మాట్లాడుతూ: తన నియమాకానికి కృషి చేసిన జర్నలిస్టు సోదరులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.జర్నలిస్టుల సమస్య ధ్యేయంగా పనిచేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో సావనపల్లి గణేష్,శరత్, లు ఉన్నారు.

# బ్రిడ్జి నిర్మాణం కోసం బీజేపీ నాయకుల ధర్నా



**బలగం టీవీ, గంగాధర**

కరినగర్ జిల్లా గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామంలో గంగాధర మండల బీజేపీ శాఖ అధ్యక్షులు పంజాల ప్రశాంత్ ఆధ్వర్యంలో నూతన బ్రిడ్జి నిర్మాణం కోసం ధర్నా కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు దూలం కళ్యాణ్ మాట్లాడుతూ: గత ఎన్నికల ముందు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం లక్ష్మీదేవిపల్లి బ్రిడ్జి నిర్మాణం కోసం, గెలిచిన వెంటనే నిధులు మంజూరు చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బ్రిడ్జి నిర్మిస్తానని హామీ ఇచ్చారు. కానీ గెలిచిన తరువాత ఆ హామీని మర్చిపోయారని, ఇప్పటివరకు బ్రిడ్జి నిర్మాణంపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఈ ప్రాంత ప్రజలను మోసం చేస్తూరని అన్నారు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని, ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,తక్షణమే బ్రిడ్జి నిర్మాణం ప్రారంభించాలని డిమాండ్ చేస్తున్నాం. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేయడం జరిగిందని, లేకపోతే మరోసారి మండల బిజెపి శాఖ ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి మరింత భారీగా ఆందోళనలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడవల్లి శశిధర్ రెడ్డి, మల్యాల వినయ్ సాగర్ (జిల్లా ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి), జిల్లా కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు వినుకొండ నరసింహారెడ్డి, గాలిపల్లి శ్రీనివాస్, దాసరి ఆంజనేయులు, సత్యనారాయణ, వినోద్ తదితరులు, వివిధ గ్రామాల ప్రజలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అండగా ఉంటాం..

**బలగం టీవీ, సిరిసిల్ల**

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని, సర్దాపూర్ గ్రామాభివృద్ధికి కూడా తమ సహకారం ఉంటుందని పోలీస్ కమాండెంట్ ఎం.ఐ. సురేష్ అన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం పరిధిలోని సర్దాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 17వ బెటాలియన్ తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ ఆధ్వర్యంలో ఉచితంగా విద్యా సామగ్రి, వాటర్ ప్యూరిఫైయర్ పంపిణీ చేశారు. అదేవిధంగా పోలీస్ కానిస్టేబుల్ రామ్-అంజలి దంపతుల కుమార్తె లక్ష్మి వర్ణిక పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉచితంగా బ్యాగులు పంపిణి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పోలీస్ కమాండెంట్ ఎం.ఐ. సురేష్ హాజరై మాట్లాడుతూ మొదటి విడతలో భాగంగాసర్దాపూర్ ప్రభుత్వ పాఠశాలను ఆదర్శంగా ఎంచుకొని, పాఠశాలకు పెయింటింగ్ వేయడం, మెరుగైన విద్యకు తోడ్పడటం, మంచి తాగునీటిని అందించడం వంటి పనులకు ప్రాధాన్యతనిస్తున్నామని అన్నారు. పోలీస్ క్రికెట్ టీమ్ నిరుపేద విద్యార్థులకు మెరుగైన విద్య అందించడానికి, వారి ఆరోగ్యాన్ని పెంపొందించడానికి మంచి తాగునీరు అందించడానికి కృషి చేస్తుందని అన్నారు. ఈ గ్రామానికి ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా తమ వంతు సాయం అందిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ జే. రాందాస్, ఎంఈఓ దూస రఘుపతి, ఏ ఏ పీసీ చైర్మన్ లక్ష్మి, ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టర్ బి. స్వాతి, పోలీస్ ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, 17వ బెటాలియన్ పోలీస్ సిబ్బంది, పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రెడిట్ బ్రాండ్ అంబాసిడర్‌గా సచిన్ టెండూల్కర్

**బలగం టీవీ, హైదరాబాద్**




రెడిట్ సోషల్ మీడియా సంస్థకు.. భారత లెజెండరీ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ బ్రాండ్ అంబాసిడర్ అయ్యారు. క్రీడా వర్గాల్లో, క్రీడా అభిమానుల్లో తమ ప్లాట్‌ఫామ్‌ను విస్తరించాలన్న ఉద్దేశంతో సచిన్‌ను అంబాసిడర్‌గా నియమించినట్లు తెలుస్తోంది. తన అఫీషియల్ రెడిట్ అకౌంట్ ద్వారా సచిన్ అభిమానులకు అందుబాటులో ఉండాడు. ఆ ఫ్లాట్‌ఫామ్‌లో యూజర్స్‌తో యాక్టివ్‌గా ఎంగేజ్ అవుతాడు. సబ్‌రెడిట్స్‌తో చర్చల్లో సచిన్ పాల్గొననున్నాడు. పర్సనల్ స్టోరీలు, మ్యాచ్ విశ్లేషణలు, విశిష్టమైన కాంటెంట్‌ను తన ఫ్యాన్స్ సచిన్ షేర్ చేసుకోనున్నారు. భారత క్రికెట్, భారతీయ క్రీడల గురించి రెడిటర్స్‌తో చర్చించేందుకు ఆసక్తిగా ఉన్నట్లు సచిన్ పేర్కొన్నారు. ఫ్యాన్స్‌తో కొత్త రీతిలో తమ అనుభవాల్ని పంచుకునే అవకాశం వచ్చిందన్నారు.

# లీడర్‌షిప్ గ్రూప్ నుంచే నేనే తప్పుకున్నాను

- **జస్‌ప్రీత్ బుమ్రా**

**బలగం టీవీ, హైదరాబాద్**



టీమిండియా లీడర్‌షిప్ గ్రూప్ నుంచే తానే తప్పుకున్నానని టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా తెలిపాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఒకేసారి టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలకడంతో అప్పటి వరకు వైస్ కెప్టెన్‌గా ఉన్న బుమ్రాకే సారథ్య బాధ్యతలు దక్కుతాయని అందరూ భావించారు. కానీ భారత సెలెక్టర్లు శుభ్‌మన్ గిల్‌ను సారథిగా ఎంపిక చేశారు. తాజాగా ఈ వ్యవహారంపై మాట్లాడిన జస్‌ప్రీత్ బుమ్రా.. లీడర్‌షిప్ గ్రూప్ నుంచి తప్పుకుంటానని తానే స్వయంగా బీసీసీఐకి సమాచారామిచ్చానని తెలిపాడు. 'రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ రిటైర్మెంట్‌కు ముందే.. ఐపీఎల్ జరుగుతున్న సమయంలోనే నేను బీసీసీఐతో మాట్లాడాను. ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌లో నాపై ఉండే వర్క్‌లోడ్ గురించి చర్చించాను. ఆ వెంటనే నా వెన్ను నొప్పికి చికిత్స అందిస్తున్న వైద్యులు, ఫిజియోలతో మాట్లాడాను. ఈ వ్యవహారంలో మేం కాస్త తెలివిగా ఉండాలనే నిర్ణయానికి వచ్చాం. అయితే టీమిండియా లీడర్‌షిప్ గ్రూప్ నుంచే నేనే తప్పుకున్నాను. కెప్టెన్‌గా నన్ను బీసీసీఐ పరిగణించింది. కానీ జట్టు శ్రేయస్సు కోసం నేను బీసీసీఐకి ఫోన్ చేసి లీడర్‌షిప్ గ్రూప్ నుంచి తప్పుకుంటానని చెప్పాను. ఎందుకంటే ఇంగ్లండ్ పర్యటనలో నేను ఐదు టెస్ట్‌లకు ఐదు ఆడే పరిస్థితి లేదు. మూడు మ్యాచ్‌లకు ఒక కెప్టెన్.. మరో రెండు మ్యాచ్‌లకు మరో కెప్టెన్ ఉండటం సరికాదనిపించింది. జట్టుకు కూడా నష్టం జరుగుతుంది. ఈ క్రమంలోనే నా వ్యక్తిగత ప్రయోజనాల కంటే జట్టుకు తొలి ప్రాధాన్యత ఇచ్చాను.'అని తాజాగా స్కై స్పోర్ట్స్‌తో బుమ్రా మాట్లాడుతూ తెలిపాడు.

# నటుడు సందీప్ కిషన్ ఇంట విషాదం

**బలగం టీవీ, హైదరాబాద్**




నటుడు సందీప్ కిషన్ కుటుంబంలో విషాదం నెలకొంది. ఆయన నానమ్మ శ్రీపాదం ఆగ్నేసమ్మ (88) విశాఖపట్నంలో సోమవారం కన్నుమూశారు. జ్ఞానాపురం సిరిల్ వీధికి చెందిన ఆగ్నేసమ్మ గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు సమాచారం. ఆమె విశాఖలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేసి పదవీ విరమణ చేశారు. మంగళవారం విశాఖపట్నంలోని సెయింట్ పీటర్స్ కేథడ్రల్ చర్చి సెమెట్రిలో ఆగ్నేసమ్మ అంత్యక్రియలు నిర్వహించారు. అనంతరం, సందీప్ కిషన్ తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా భావోద్వేగ పోస్ట్ పంచుకున్నారు. " మేము మా నానమ్మను కోల్పోయాము. మా తాతయ్య కృష్ణం నాయుడు షిప్ ఆర్కిటెక్ట్ అయితే, నానమ్మ ఆగ్నెస్ వైజాగ్‌లో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు. 1960ల నాటి వారి మతాంతర ప్రేమ ఓ సినిమా కథలాంటిది. పెళ్లి తర్వాత తాతయ్య జోసెఫ్ కృష్ణం నాయుడుగా, నానమ్మ ఆగ్నెస్ లక్ష్మిగా మారారు. నాకు తెలిసిన అతి గొప్ప ప్రేమకథ వాళ్లది. మిస్ యూ నానమ్మ.. లవ్ యూ" అంటూ తన ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, పలువురు ఆయనకు ధైర్యం చెబుతున్నారు.

# 'కన్నప్ప' విడుదలకు ఏపీ హైకోర్టు గ్రన్ సిగ్నల్

**బలగం టీవీ, హైదరాబాద్**

మంచు మోహన్ బాబు, విష్ణు నిర్మించి, నటించిన కన్నప్ప చిత్రంలోని సన్నివేశాలు, పాత్రల పేర్లు బ్రాహ్మణ సామాజిక వర్గాన్ని కించపరిచే విధంగా ఉన్నాయని బ్రాహ్మణ చైతన్య వేదిక అధ్యక్షుడు సిరిపురపు వెంకట శ్రీధర్ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఏపీ హైకోర్టు విచారణ జరిపింది. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఈ నెల 27న చిత్రం విడుదల కానున్నందున ఆ ప్రక్రియను నిలువరించాలని కోరారు. ఇందుకు అంగీకరించని హైకోర్టు.. ప్రతివాదులైన కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి, సీబీఎఫ్ సీ, సీఈవో, సీబీఎఫ్ సీ ప్రాంతీయ కార్యాలయ అధికారి, ఏపీ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, దర్శకుడు ముఖేష్ కుమార్, నటులు మోహన్ బాబు, విష్ణు, కన్నెగంటి బ్రహ్మానందం, పి. వెంకట ప్రభుప్రసాద్, సప్తగిరిలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఆగస్టు 1కి వాయిదా వేసింది. సినిమా విడుదల అయ్యాక అభ్యంతరకర విషయాలు ఉంటే తొలగించేలా ఆదేశిస్తామని న్యాయమూర్తి పేర్కొన్నారు. దీంతో కన్నప్ప చిత్రం విడుదలకు హైకోర్టు నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చినట్టయింది.

# టీ20 ప్రపంచకప్ షెడ్యూల్ విడుదల




**బలగం టీవీ, హైదరాబాద్**

మహిళల టీ20 వరల్డ్ కప్ -2026 షెడ్యూల్ విడుదలైంది. ఇంగ్లండ్-వేల్స్ వేదికగా వచ్చే ఏడాది(2026) జూన్ 12 నుంచి మహిళల టీ20 ప్రపంచ కప్ ప్రారంభం కానుంది. ఐసీసీ ఈ మేరకు బుధవారం షెడ్యూల్ విడుదల చేసింది. 12 జట్లు భాగం కానున్నాయి. భారత్. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, పాకిస్థాన్, వెస్టిండీస్, ఇంగ్లండ్, న్యూజిలాండ్, శ్రీలంక జట్లతో పాటు గ్లోబల్ క్వాలిఫయర్స్ ఫలితాల ఆధారంగా మరో 4 జట్లు వరల్డ్ కప్‌నకు అర్హత సాధించనున్నాయి.

ఈ 12 జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. గ్రూప్ ఏ, గ్రూప్ బీలో తలో 6 జట్లు ఉండనున్నాయి. ఇంగ్లాండ్, శ్రీలంక జట్ల మధ్య తొలి మ్యాచ్ జరగనుంది. టీ20 ప్రపంచ కప్ 2026 ఏడు వేదికల్లో 24 రోజుల పాటు సాగనుంది. ఇందులో భాగంగా 33 మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇంగ్లండ్‌లోని ఎడ్జ్‌బాస్టన్, హాంప్‌షైర్ బౌల్, హెడ్డింగ్లీ, ఓల్డ్ ట్రఫోర్డ్, ది ఓవల్, బ్రిస్టల్ కౌంటీ గ్రౌండ్,లార్డ్స్ మైదానాలు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఇంగ్లాండ్, శ్రీలంక జట్ల మధ్య జూన్ 12న మొదలయ్యే మహిళల టీ20 ప్రపంచ కప్-2026 టోర్నీ జులై 5న లార్డ్స్ మైదానంలో ఫైనల్ జరగనుంది.

గ్రూప్-ఏ: భారత్. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, పాకిస్థాన్, 2 క్వాలిఫయర్ టీమ్స్

గ్రూప్ బీ: వెస్టిండీస్, ఇంగ్లండ్, న్యూజిలాండ్, శ్రీలంక, 2 క్వాలిఫయర్ టీమ్స్

భారత జట్టు తమ తొలి మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్ జట్టుతో తలపడనుంది. జూన్ 14న పాకిస్థాన్ జట్టుతో ఆ కీలక మ్యాచ్ జరగనుంది. ఆ తర్వాత గ్లోబల్ క్వాలిఫయర్స్ నుంచి వచ్చిన జట్టుతో జూన్ 17న భారత్ తలపడనుంది. ఆ తర్వాత జూన్ 21న దక్షిణాఫ్రికా జట్టుతో, జూన్ 25 క్వాలిఫయర్ జట్టుతో, జూన్ 28న ఆస్ట్రేలియా జట్టుతో భారత్ తేల్చుకోనుంది.

**భారత జట్టు మ్యాచ్‌ల షెడ్యూల్**

జూన్ 14: భారత్ వర్సెస్ పాకిస్థాన్

జూన్ 17: భారత్ వర్సెస్ గ్లోబల్ క్వాలిఫైయర్ 1


జూన్ 21: భారత్ వర్సెస్ దక్షిణాఫ్రికా

జూన్ 25: భారత్ వర్సెస్ గ్లోబల్ క్వాలిఫైయర్ 2

జూన్ 28: భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా

# నటుడు టామ్ క్రూజ్‌కు ఆస్కార్

**బలగం టీవీ, హైదరాబాద్**



హాలీవుడ్ సూపర్ స్టార్ టామ్ క్రూజ్‌ని ఆస్కార్ అవార్డు వరించనుంది. నవంబర్ 16న లాస్ ఏంజిల్స్‌లో జరిగే 2025 గవర్నర్స్ అవార్డ్స్‌లో టామ్ ఈ అవార్డును అందుకోబోతున్నారు. ఈ విషయాన్ని అకాడమీ ఆఫ్ మోషన్ పిక్చర్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్ అధికారికంగా ప్రకటించింది. టామ్‌తో పాటు మరో ముగ్గురు వ్యక్తులు డాలీ పార్టన్, డెబీ అలెన్, విన్ థామస్‌కు కూడా ఈ గౌరవ పురస్కారాన్ని అందుకుంటారని అకాడమీ ప్రకటించింది. సినిమా రంగంలో టామ్ క్రూజ్ చేసిన అద్భుతమైన కృషికి, మరియు స్టంట్స్ కమ్యూనిటీకి ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా ఈ గౌరవం లభించనుంది.

# 3 గంటల రన్‌టైంతో 'కుబేర'

**బలగం టీవీ, హైదరాబాద్**

టాలీవుడ్ దిగ్గజ దర్శకుడు శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందుతున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'కుబేరా'. తమిళ స్టార్ ధనుష్, టాలీవుడ్ మన్మథుడు నాగార్జున, క్రేజీ బ్యూటీ రష్మిక మందన్నా ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ఏకకాలంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ %బ్రూ%, అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్లపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా జూన్ 20, 2025న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుండగా.. తాజాగా ఈ చిత్రం సెన్సార్ కంప్లీట్ చేసుకుంది. సెన్సార్ బోర్డు ఈ చిత్రానికి యూ/ఏ సర్టిఫికేట్‌ను అందజేసింది. అలాగే 181 నిమిషాల భారీ రన్‌టైంతో ఈ సినిమా విడుదల కాబోతుంది.

# 'పెద్ది' భారీ ట్రైన్ యాక్షన్ షూటింగ్

**బలగం టీవీ, హైదరాబాద్**



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హైలీ యాంటిసిపేటెడ్ పాన్-ఇండియా ప్రాజెక్ట్ 'పెద్ది'. నేషనల్ అవార్డ్ విన్నింగ్ ఫిలిం మేకర్ బుచ్చి బాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే సినిమా ఫస్ట్ షాట్ గ్లింప్స్ తో దేశవ్యాప్తంగా హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. పవర్ ఫుల్ కొలాబరేషన్, అద్భుతమైన టీంతో 'పెద్ది' భారతీయ సినిమాలో కొత్త ప్రమాణాలను నెలకొల్పడానికి సిద్ధంగా ఉంది. ప్రముఖ పాన్-ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో విజనరీ వెంకట సతీష్ కిలారు తన ప్రతిష్టాత్మక బ్యానర్ వృద్ధి సినిమాస్ బ్యానర్ పై భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇటీవలే చిత్రం యూనిట్, విలేజ్ బ్యాక్ డ్రాప్ లో ప్రత్యేకంగా నిర్మించిన భారీ సెట్లో కీలక సన్నివేశాలతో పాటు ఓ భారీ యాక్షన్ బ్లాక్‌ను పూర్తి చేసింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో నిర్మించిన మ్యాసీవ్ సెట్లో భారత సినిమా చరిత్రలో ఎన్నడూ లేనంత అద్భుతమైన యాక్షన్ సన్నివేశం చిత్రీకరణ జరుగుతోంది. ఇది ఇండియన్ యాక్షన్ సినిమాల ప్రమాణాలను పెంచేలా ఉన్న హై-ఆక్టేన్, హై బడ్జెట్‌తో రూపొందిస్తున్న ట్రైన్ ఎపిసోడ్. ప్రముఖ ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కొల్లా అద్భుతంగా సెట్స్ ని డిజైన్ చేశారు. ఈ ట్రైన్ స్టంట్ కోసం రూపొందించిన సెట్స్ కన్నులకు పండుగగా ఉండబోతున్నాయి. ఈ ఎపిసోడ్‌లో రామ్ చరణ్ తన కెరీర్‌లోనే అత్యంత రిస్కీ స్టంట్స్ చేస్తున్నారు. పుష్ప 2 వంటి చిత్రాల్లో తన వర్కింగ్ స్టయిల్ తో ఆకట్టుకున్న నబాకాంత్ మాస్టర్ ఈ యాక్షన్ సీక్వెన్స్ కు కొరియోగ్రఫీ వహిస్తున్నారు.




# డ్రిల్ మాస్టర్‌గా శివ శంకర్ వరప్రసాద్

**బలగం టీవీ, హైదరాబాద్**

మెగాస్టార్ చిరంజీవి అసలు పేరు కొణిదెల శివ శంకర వరప్రసాద్ అని తెలిసిందే. ప్రస్తుతం అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఆయన హీరోగా నటిస్తున్న సినిమాలో శివ శంకర్ వరప్రసాద్‌గా కనిపించనున్నట్టు తెలుస్తోంది. ఈ మెగా 157లో స్కూల్ డ్రిల్ మాస్టర్ శివశంకర వరప్రసాద్ పాత్రలో చిరంజీవి కనిపించనున్నారని సమాచారం. ప్రస్తుతం ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని ముస్సోరీలో షూటింగ్ జరుగుతోంది. అక్కడ ఒక పాఠశాలలో చిరంజీవి సహా ఇతర ప్రధాన తారాగణం మీద కీలకమైన టాకీ పార్ట్ షఉటింగ్ చేస్తున్నారు. 'సంక్రాంతికి వస్తున్నాం'లో బుల్లిరాజుగా మాస్టర్ రేవంత్‌తో హాస్యాన్ని పంచిన అనీల్ రావిపూడి ఇప్పుడు మెగా 157లో చిరంజీవితో తెగ కామెడీ పండించనున్నాడట. చిరుకి జతగా ఇందులో బుల్లిరాజు కూడా ఉంటాడట. చిరు-రేవంత్ మధ్య వచ్చే కామెడీ సీన్స్ ఓ రేంజ్ లో ఉంటాయని అంటున్నారు. ఈ షెడ్యూల్ లో చిరంజీవితో పాటు నయనతార, కేథరిన్ థ్రెసా కూడా